# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ రంగంపై ఈరోజు శ్వేతపత్రం విడుదల చేశారు.
- భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి రేపు విశాఖ నగరానికి రానున్నారు.
- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు 2026 నాటికి పూర్తవుతాయని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో విద్యుత్ రంగంపై ఈరోజు శ్వేతపత్రం విడుదల చేశారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే ఈ శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ... విద్యుత్‌తో ప్రతి ఒక్కరి జీవితం ముడిపడి ఉందని, ట్రూ అప్, ఇంధన సర్‌ఛార్జి, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని రకరకాలుగా గత ప్రభుత్వం ప్రజల నుంచి అధికంగా ఛార్జీలు వసూలు చేసిందన్నారు. గృహ వినియోగదారులపై 45 శాతం ఛార్జీలు పెంచారని, దీంతో కోటీ 53 లక్షల మంది ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. గత ఐదేళ్లలో విద్యుత్ సంస్థల అప్పు 79 శాతం మేర పెరిగిందని, విద్యుత్ రంగంలో ప్రజలకు, ప్రభుత్వానికి దాదాపు లక్షా 29 వేల 503 కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు మరింత పెరుగుతాయని... ఈ వాహనాల డిమాండ్ మేరకు విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవాలని అన్నారు. టారిఫ్ నియంత్రణపై దృష్టి సారిస్తామని, విద్యుత్ రంగాన్ని సరైన రీతిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్ మీటర్లపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ.....

(వాయిస్ 37 సెకన్లు)

==========================

భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రష్యాలోని మాస్కోలో ఈరోజు ప్రవాస భారతీయ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో నేటి భారతదేశం ఏ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా అది సాధిస్తుందని అన్నారు. వరుసగా మూడవసారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారతీయ ప్రవాసులతో తన మొదటి సమావేశం ఇదేనని తెలిపారు. ఈ సారి నూతన ఉత్సాహంతో మూడు రెట్లు ఎక్కువ శక్తితో, మూడు రెట్లు ఎక్కువ వేగంతో పని చేస్తానని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ రోజు భారతదేశం డిజిటల్ లావాదేవీల పరంగా ప్రపంచానికి అత్యంత విశ్వసనీయ నమూనాగా నిలిచిందన్నారు. సామాజిక రంగంలో చేపట్టిన అద్భుతమైన విధానాల కారణంగా, దేశంలో అనుకున్న లక్ష్యాలు సాధించగలిగామని ప్రధాన మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి రేపు విశాఖ నగరానికి రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రేపు సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఆర్ఐఎన్ఎల్ గెస్ట్ హౌస్ కు వెళతారని అధికారక వర్గాలు వెల్లడించాయి. ఎల్లుండి ఉదయం మంత్రి స్టీల్ ప్లాంట్ ను సందర్శిస్తారని, అనంతరం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, స్టీల్ ప్లాంట్ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని అధికారులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈరోజు విమానాశ్రయ ప్రాంతాన్ని మంత్రి పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈనెల 11న ముఖ్యమంత్రి విశాఖ పర్యటనలో భాగంగా భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శిస్తారని తెలిపారు. విమానాశ్రయ ప్రస్తుత నిర్మాణ పనులను వివరిస్తూ... విమానాశ్రయం పనులను గత ప్రభుత్వం ఆలస్యం చేసిందని, డిసెంబరు నాటికి టెర్మినల్ భవనం పూర్తి చేసి, 2026 నాటికి భోగాపురం విమానాశ్రయ పనులు పూర్తవుతాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఇది పూర్తయితే సుమారు 6 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 227వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 5 లక్షల 40 వేల కోట్ల రూపాయల రుణ ప్రణాళికను విడుదల చేసింది. ఇందులో 3 లక్షల 75 వేల కోట్ల రూపాయల ప్రాధాన్య రంగాలకు, లక్షా 65 వేల కోట్ల రూపాయలు ఇతర రంగాలకు కేటాయించింది. అలాగే వ్యవసాయ రంగానికి 2 లక్షల 64 వేల కోట్ల రూపాయల రుణాలు లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో కంటే 14 శాతం అధికంగా రుణాలు ఇవ్వడంతో పాటు పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ, మత్స్య విభాగం, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలకు 32 వేల 600 కోట్ల రూపాయలతో రుణ ప్రణాళికను రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ ప్రతిపాదించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో భారత వాతావరణ శాఖ ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. నిన్న ముంబయి నగరంలో భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. ఇప్పటికే అస్సాం, మేఘాలయా రాష్ట్రాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. ఈనెల 12న పశ్చిమబెంగాల్, సిక్కింలలో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లలో మాత్రం ఈనెల 11 వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై కేంద్ర సంస్థలు విచారిస్తాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వానికి సహకరించేందుకు కేంద్ర మంత్రులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రత్యేక హోదా, పోలవరం అంశాలపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ప్రత్యేక హోదాకు సమానంగా నిధులివ్వడం జరిగిందని పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీకాకుళం నగరం మీదుగా ప్రవహిస్తున్న నాగావళి నది అభివృద్ధికి, సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగావళి నదీ పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చేసేలా ప్రాజెక్టులను గుర్తించాలన్నారు. నిపుణుల కమిటీ, సలహా కమిటీల ఏర్పాటుపై నిర్దిష్ట ఉత్తర్వులల్ని సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఉచిత ఇసుక సరఫరాతో నిర్మాణరంగానికి మళ్లీ ప్రోత్సాహం లభించిందని విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ అన్నారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ విధానాల కారణంగా ఇసుక ఆదాయ వనరుగా మారిపోయిందని, ఫలితంగా కృత్రిమ కొరత, వనరుల దోపిడీతో నిర్మాణరంగం దెబ్బతిందన్నారు. దీనివల్ల 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని, కూటమి ప్రభుత్వం రావడంతో గృహనిర్మాణ రంగం మళ్ళీ అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన లిఖిత పూర్వక హామీకి కట్టుబడివున్నామని, స్టీల్ ప్లాంట్ ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఎంపీ శ్రీ భరత్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రత్యామ్నాయ పంటలతోనే గంజాయి సాగు నిర్మూలన సాధ్యమని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఈరోజు కలెక్టరేట్ లో గంజాయి నిర్మూలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గంజాయి సాగు చేస్తున్న రైతులను పోలీసు శాఖ ద్వారా గుర్తించి వారికి దీని వల్ల కలిగే సమస్యలు, ప్రత్యామ్నాయ పంటల వల్ల కలిగే లాభాలను వివరించి, ఆయా పంటల వైపు ఆకర్షించాలని సూచించారు. తద్వారా యువత కూడా పెడతోవన పడకుండా చర్యలు చేపట్టవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =